వైఎస్ఆర్
కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
ఆదివారం 19 ఏప్రిల్ 2026



## స్మార్ట్ కిచెన్ తనిఖీ చేసిన కలెక్టర్..

యర్రగుంట్ల ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో రూ.65 లక్షల తో డొక్కా సీతమ్మ మధ్యాహ్నా భోజనం పథకం కింద ఏర్పాటు అవుతున్న స్మార్ట్ కిచెన్ పనులను శనివారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తనిఖీ చేశారు. ఈ స్మార్ట్ కిచెన్ నందు జరుగుతున్న సోలార్, బయోగ్యాస్, వాటర్ ప్లాంట్ పనులను కలెక్టర్ ఎంఈఓ శివప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. త్వరిగతిన పనులు పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి,అధికారులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ

## జనగణన నమోదు చేసుకోవాలి

రాజంపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త



రాజంపేట డివిజన్ లోని ప్రతి ఒక్కరూ తమ వివరాలను జనగణన వెబ్సైట్లో నమోదు చేసుకొని సర్వే సిబ్బందికి సహకరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 16 నుంచి జనగణన ప్రారంభమైందని, 30 వరకు కొనసాగుతుందని మొబైల్ లేదా ఆన్లైన్లో జనాభా వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. ఇంట్లో ఎవరు ఉన్నా మొత్తం వివరాలు ,విద్య అర్హత, తూర్పు సమాచారం నమోదు చేయాలన్నారు. ఇన్యుమరేటర్లు వచ్చినప్పుడు ఐడి ఇస్తే సరిపోతుందని తెలిపారు. ఆన్లైన్ లేదా మొబైల్ లో వివరాలు నమోదు చేయని వారి వివరాలు సర్వే సిబ్బంది వచ్చినప్పుడు తీసుకుంటారని తెలిపారు. ఈ సమాచారం పూర్తి గోప్యమని పేర్కొన్నారు. జనగణన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరచేతిలో అగ్ని..

# నిప్పుల కొలిమిలో కడప

### కడపలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, ప్రజలు ఉక్కిరిబిక్కిరి

### వాతావరణ శాఖ హీట్ వేవ్స్ హెచ్చరిక

### ఎల్నినో ప్రభావంతో అధికమైన ఉక్కపోతలు






ఎడ్యుకేషన్ ఏప్రిల్ 18 ప్రభాతవార్త

జిల్లాలో ఎండలు రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతున్నాయి. శనివారం నాడు కడప పట్టణంలో 45.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవడం పరిస్థితి ఎంత భయానకంగా ఉందో తెలియజేస్తోంది. ఉదయం నుంచే సూర్యుడు మండిపడుతూ ఉండగా, మధ్యాహ్నానికి వేడి తాపం మరింత పెరిగి ప్రజలను ఇళ్లకే పరిమితం చేసింది. రోడ్లపై సాధారణ రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. అత్యవసర అవసరాలు తప్ప ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు.

**::ఎండల దాటికి నిలిచిపోయిన సాధారణ జీవనం**

మండుతున్న ఎండల కారణంగా కడప పట్టణంలోని ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు సైతం వెలవెలబోయాయి. మధ్యాహ్నా సమయంలో రోడ్లపై కనిపించేవి కొద్దిమంది మాత్రమే. వ్యాపారాలు కూడా ప్రభావితమవుతూ, చిన్నచిన్న దుకాణాలు మధ్యాహ్నం మూసివేస్తున్నాయి. కూలీలు, దినసరి కార్మికులు తమ పనులను కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**::చిన్నపిల్లలు, వృద్ధులు అత్యంత ప్రమాదంలో**

ఈ ఎండల ప్రభావం ఎక్కువగా పసిపిల్లలు, వృద్ధులపై పడుతోంది. వేడి గాలులు (లూ) కారణంగా తలనొప్పి, అలసట, వాంతులు, డీహైడ్రేషన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఆసుపత్రుల్లో హీట్ స్ట్రోక్ లక్షణాలతో వచ్చే వారి సంఖ్య కూడా పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

**హీట్వేవ్ హెచ్చరిక - మరింత అప్రమత్తత అవసరం**

వాతావరణ శాఖ సూచనల ప్రకారం రానున్న రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు 44 C వరకు పెరిగే అవకాశముంది. దీంతో జిల్లా వ్యాప్తంగా హీట్వేవ్ పరిస్థితులు కొనసాగే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

**ప్రజలకు ముఖ్య సూచనలు**

రోజుకు కనీసం 3-4 లీటర్ల నీరు తాగాలి. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లడం పూర్తిగా నివారించాలి. బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, గుడ్డ, అంబ్రెలా ఉపయోగించాలి. తేలికపాటి, లైట్ కలర్ దుస్తులు ధరించాలి. నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్ల వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. చిన్నపిల్లలు, వృద్ధులను ప్రత్యేకంగా జాగ్రత్తగా చూసుకోవాలి. వాహనాల్లో పిల్లలను ఒంటరిగా వదిలిపెట్టకూడదు

**:: ప్రభుత్వంపై ప్రజల ఆశలు**

మండుతున్న ఎండల నేపథ్యంలో తాగునీటి కొరత సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చల్లని తాగునీటి సౌకర్యాలు, వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో తాత్కాలిక నీడ షెడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**పర్యావరణ పరిరక్షణపై దృష్టి అవసరం**

నిపుణుల అభిప్రాయం ప్రకారం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు వృక్ష సంపద తగ్గుదల కూడా ఒక ప్రధాన కారణంగా ఉంది. చెట్లు నాటడం, పచ్చదనం పెంచడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి తీవ్ర ఎండల ప్రభావాన్ని తగ్గించవచ్చని సూచిస్తున్నారు. మొత్తం మీద, కడప జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరం.

శ్రీ భువనగిరి లక్ష్మీనరసింహా స్వామి

## బ్రహ్మోత్సవాలకు చమర్తికి ఆహ్వానం



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న జగన్మోహన్రాజు

రాజంపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

కడప రేణిగుంట జాతీయ రహదారి పక్కనే భువనగిరిపల్లె కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు శనివారం ఆవిష్కరించారు. రాజంపేట పట్టణంలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో చమర్తి జగన్ మోహన్ రాజుని శ్రీ భువనగిరి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఈనెల 29 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని, కళ్యాణం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ,అలయ ధర్మకర్తలు మన్నేరు లక్ష్మీనరసయ్య, పూల హరిప్రసాద్, కావేరి గారి వెంకటరమణ,నామాల రాజశేఖర్, కంబయ్య గారి సుబ్బ నరసింహులు, కొమ్మూరు సుబ్బ నరసయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నె సుబ్బనరసయ్య నాయుడు, పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇండి కూటమికి భారత

## నారీమణుల ఉసురు తప్పదు..



కడప కార్పొరేషన్ ఏప్రిల్ 18 ప్రభాతవార్త:

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండి కూటమి అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శనివారం కడప ఆర్టీసీ బస్టాండ్ దగ్గర భారతీయ జనతా ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఆ కూటమి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కడప జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ మహిళా సాధికారత కోసం బిల్లు తెస్తుంటే, రాజకీయ స్వార్థంతో అడ్డుకున్న ఇండి కూటమికి భారత నారీమణుల ఉసురు తప్పకుండా తగులుతుందని, రాబోయే రోజుల్లో ఆ కూటమికి అడ్రస్ లేకుండా చేయడం ఖాయమని హెచ్చరించారు. 70 ఏళ్ల కల సాకారమవుతున్న వేళ, దేశద్రోహ శక్తులన్నీ ఏకమై మహిళల హక్కులను కాలరాయడం దారుణమని మండిపడ్డారు. దేశ హితం కోరే ప్రతి బిల్లును అడ్డుకోవడం ఈ ఇండి కూటమికి అలవాటుగా మారిందని, మహిళలతో పెట్టుకున్న వారికి గతంలో రాజ్యాలే పోయాయని, ఇండి కూటమి నాయకులకు రాజకీయ సన్యాసమే గతి అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మ, నాయకురాలు చేవూరి శారదమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి బాయ్, సీనియర్ నాయకులు చలపతి, లక్ష్మీనారాయణ రెడ్డి, బీరం సుబ్బారెడ్డి, ప్రవీణ్, ఓబులేసు, అమర్నాథ్ రెడ్డి, కె . మల్లికార్జున, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, వెంకటరమణ, గౌతంరెడ్డి, రామ్మోహన్మ, జనసేన నాయకులు మాలే శివ, హిళలు నాయకులు పాల్గొన్నారు.

## జల సమృద్ధిత స్వచ్ఛ జిల్లాగా మార్చేందుకు అందరూ కృషిచేయాలి





యర్రగుంట్ల ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా వైఎస్ఆర్ కడప జిల్లాను కాలుష్య రహిత, జల సమృద్ధిత స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామంలోని పీఎం శ్రీ జెడ్పి హైస్కూలు ప్రాంగణంలో "జలధార జల హారతి" ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్. చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ సభలో స్వచ్ఛ దివస్ లో భాగంగా "నీటి సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం" అనే నినాదాన్ని తెలుపుతూ స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర సాధన అందరి బాధ్యతతగా భావించాలని జిల్లా కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా జిల్లాలో మనం కూడా స్వచ్ఛత వైపు ఒక ముందడుగు వేశామన్నారు. జిల్లాలో స్వచ్ఛరథం ద్వారా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తేదీ, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడం తోపాటు వ్యర్థాలను సేకరించినందుకు ప్రతిఫలంగా ప్రజలకు అవసరమైన విలువ ఆధారిత నిత్యవసర వస్తువులను కూడా అందివ్వడం జరుగుతోందన్నారు. ఒక విధంగా ఈ విధానం చెత్త నుండి ఆదాయాన్ని గడించడమే అని చెప్పవచ్చు. ఈ విధానం ద్వారా.. గ్రామాలు, పట్టణాలలో వ్యర్థాలను కూడా వృధా చేయకుండా, ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా.. ఒక క్రమ పద్ధతిలో తేదీ, పొడి వ్యర్థాలను వేరు చేసే బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతవైపు బాధ్యతగా అడుగు వేయాలన్నారు. అది మన బాధ్యత అని గుర్తు చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలాధార జల హారతి కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో భూగర్భ జలాల సంరక్షణ కోసం ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి పాఠశాల సిబ్బంది గ్రామానికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. నీటి సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం సుగమం అన్నారు. పారిశుధ్య మెరుగు ఎంత అవసరమో.. జల సంరక్షణ కూడా అంతే అవసరం అని.. ప్రతి నీటి బొట్టును అత్యంత విలువైనదిగా సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. భూగర్భ జలశాఖ, డ్వామా శాఖలు సంయుక్తంగా చేపడుతున్న కార్యక్రమాలు జల సంరక్షణలో అత్యంత ప్రతినిత్యం వహిస్తూ భవిష్యత్తులో జిల్లాను కాలుష్య రహితంగా, స్వచ్ఛతవైపు నడిపిస్తూ జల సమృద్ధిత జిల్లాగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ కోసం అవలంభిస్తున్న చక్కటి పారిశుధ్య విధానాలను ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ పట్టణాలను తీర్చి దిద్దడంలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎవరి గ్రామాన్ని వారు ఆదర్శంగా తీసుకునే స్థాయికి పాంచాయతీ ప్రజలే తీసుకెళ్లాలన్నారు. ప్రతినెల మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని, 100 రోజుల జలాధార కార్యక్రమాలను జిల్లాలో పటిష్టమైన ప్రణాళికలతో విజయవంతం చేయాలన్నారు. అధికారులు కుడా ప్రతి నెలా స్వచ్ఛ దివస్ కార్యక్రమాల్లో భాగంగా.. జిల్లా అంతట పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, భూగర్భజలాల పెంపు, జల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థిని సౌమ్య ప్రియ దైనందిన జీవితంలో నీటి అవసరాలు, నీటి ఆవశ్యకత, భూగర్భజలాల సంరక్షణ అనే అంశంపై చక్కగా వివరించి సభికులను, ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం సౌమ్య ప్రియను జిల్లా కలెక్టర్ అభినందించి మొమెంతో శాలువతోసత్కరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఇంచార్జి ఆర్డీవో శిరీష, జెడ్పి సీఈవో వెంకట్రామిరెడ్డి, డిపివో వెంకట సుబ్బయ్య, డ్వామా పీడి అదిశేషారెడ్డి, గ్రౌండ్ వాటర్ డిడి మురళీధర్, టిఎల్ డిఓ రామాంజనేయులు, డిఎల్పిఓ నూర్జహాన్, స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం సురేష్ నాయుడు, సంబందిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, గ్రీన్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

## దేశం కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి

సీనియర్ నేత అమ్మినేని విజయేంద్ర



రాజంపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

దేశం కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి అని ఆ పార్టీ రాజంపేట సీనియర్ నేత అమ్మినేని విజయేంద్ర బాబు పేర్కొన్నారు. శనివారం మండలం కూచివారిపల్లెలో బిజెపి మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. జాతీయ భావంతో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బిజెపిని ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రతి పంచాయతీలో పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు చంద్రశేఖర్ రాజు ,నరేంద్ర , తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి అవగాహన

**డెమో ద్వారా రక్షణ చర్యలు వివరించిన అగ్నిమాపక సిబ్బంది... మహిళలకు ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ**

పులివెందుల,ఏప్రిల్ 18, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణ శివారులో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం ఆదిత్య బిర్లా గార్మెంట్స్ సంస్థలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది, భద్రతా సిబ్బంది, మహిళలకు అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలు మరియు రక్షణ చర్యలపై వివరించారు. పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సంభవించిన ప్పుడు ఎలా స్పందించాలి, సురక్షితంగా బయటపడే మార్గాలు ఏమిటి అనే అంశాలను ప్రదర్శన (డెమో) ద్వారా స్పష్టంగా వివరించారు. ముఖ్యంగా గ్యాస్ ఫైర్లు, ఎలక్ట్రికల్ ఫైర్ల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా పొగతో నిండిన గదిలో చిక్కుకున్నప్పుడు ఎలా బయటపడాలో ప్రాక్టికల్గా చూపించారు. ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ఒక చిన్న ట్రేలో మంటలు పెట్టి మహిళల చేత ప్రత్యక్షంగా డెమో చేయించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి యు. శరత్ బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. సునీల్ కుమార్ మరియు ఇతర అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా సిబ్బందిలో భద్రతపై చైతన్యం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.



మహిళలకు ఫైర్స్ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



గ్యాస్ ఫైర్స్ గురించి చూపిస్తున్న దృశ్యం

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే

## తాట తీస్తాం

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు రూరల్ సీఐ ఎం.నాగభూషణ్ రౌడీ షీటర్లను సత్ప్రవర్తనతో మెలగాలని హెచ్చరించారు. జిల్లాఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఏఎస్పీ విభూకృష్ణ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు శనివారం ప్రొద్దుటూరు రూరల్ పీఎస్లో ఏఎస్పీ విభూకృష్ణ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ నేర ప్రవృత్తిని విడిచి సమాజంలో మంచి నడవడికతో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే తాట తీస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రవర్తనలో మార్పు రాకపోతే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ ఎస్సైలు శ్రీకాంత్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ పై అవగాహణ

దువ్వూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:



స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నీటి సంరక్షణ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛపు నీటి సంగ్రహణ, నిర్మాణాల మరమ్మత్తులు వంటి పనులను చేపట్టారు. అక్కడే ఉన్న ఇంకుడు గుంతకు మరమ్మతులు చేసి వాటికి పైపులు తదితర వాటిని అమర్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ చెరువులు, కుంటలు శుభ్ర పరచడం, వాటికి రక్షణ కల్పించడం జరుగుతుందని అన్నారు. నీటి సంరక్షణతోనే స్వస్థత ఆంధ్ర సాధ్యమవుతుందన్నారు. రూఫ్ టాప్, రైన్ వాటర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంజీవరెడ్డి, ఈవోపీఆర్డి హరికృష్ణ, ఏపీఓ లక్ష్మీ నారాయణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## టీనేజ్ ప్రెగ్నెన్సీపై అవగాహన కార్యక్రమం




సిద్ధవటం ఏప్రిల్ 18 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఎంపీడీవో సభా భవనంలో శనివారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు టీనేజ్ ప్రెగ్నెన్సీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో ఫణి రాజకుమారి మాట్లాడుతూ బాల్య వయసులో మహిళలకు వివాహాలు చేయడం వల్ల గర్భం దాల్చినప్పుడు ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని బాల్య వివాహాలు అరికట్టేందుకు అందరం కలిసికట్టుగా పనిచేసే టీనేజ్ ప్రెగ్నెన్సీని తగ్గించడం కోసం కృషి చేయాలని తెలిపారు బాల్య వివాహాల వల్ల కొన్ని హక్కులు కోల్పోతున్నారని పిల్లల హక్కుల రక్షణ కోసం ఫోక్సో చట్టం, లేబర్ చట్టం బాల వివాహాల చట్టం వంటి వాటితో పాటు మిషన్ వాస్తల్య పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల పిల్లల శరీరంలోని ఎదుగుదల, హార్మోన్స్, ఇన్ బ్యాలెన్స్ మరియు డిప్రెషన్ కి వెళ్తారని టీనేజ్ ప్రెగ్నెన్సీ పై వైద్య సిబ్బంది కలిగే నష్టాలపై మహిళలకు తెలుపుతున్న కొంతమంది తమ పిల్లల పట్ల అజాగ్రత్త వహిస్తున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో సిడిపిఓ శోభారాణి,ఎంఈఓ అరుణ, అంగన్వాడి సూపర్వైజర్లు శ్రీవిద్య అతికారి వరలక్ష్మి, సిహెచ్ ఓ లక్ష్మీ నరసమ్మ, ఏఎస్ఐ కొండయ్య సూపర్వైజర్ మోలాలి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## మద్యం షాపులను తనిఖీ



సిద్ధవటం ఏప్రిల్ 17 ప్రభాతవార్త

జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సిద్ధవటం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలలో విస్తృత తనిఖీలు కొనసాగుతున్నాయి ప్రభుత్వ ఇటీవల ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం స్టాక్ వివరాలను తనిఖీ చేశామని ఎక్సైజ్ రాజశేఖర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌టిఐ అమలులో అధికారుల నిరక్ష్యం

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 18 ప్రభాతవార్త :

యోగివేమన విశ్వవిద్యాలయం (వైవీయూ) సమాచార హక్కు చట్ట (ఆర్.టి.ఐ) నిర్వహణాధికారులు చట్టాన్ని నీరుగారిస్తున్నారని ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ (ఏఐఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. జగదీష్ ఆరోపించారు. అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా డొంక తిరుగుడు సమాధానాలు పంపుతున్నారని, బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య బి. రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు సమాచార దరఖాస్తులో అడిగిన వివరాలు ఇవ్వడం మానేసి ఎగ్గొడ్డానికి కుంటి సాకులు వెతుకుతున్నారని జగదీష్ తెలిపారు. సమాచారం దేనికోసం ఉపయోగిస్తారో తెలియజేయాలని చట్ట విరుద్ధ ప్రశ్నలు అడుగుతున్నారని, ఆర్.టి.ఐ చట్టం 2005 సెక్షన్ 6 (2) ప్రకారం అలాంటి ప్రశ్నలు అడగకూడదని ఆయన గుర్తు చేశారు దరఖాస్తు చేసుకున్నవారిని ప్రైవేటు వ్యక్తులతో భయపెట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదిలో పేర్కొన్నారు. చట్టాన్ని తుంగలో తొక్కుతున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కోరారు. దరఖాస్తులకు నిరక్ష్య వైఖరి వద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## మనరైతు మనగౌరవం కార్యక్రమం




సిద్ధవటం, ఏప్రిల్ 18 ప్రభాతవార్త

రైతు కుటుంబంలో పుట్టిన విద్యార్థులు మా తండ్రి రైతు అంటూ గర్వంగా చెప్పుకోవాలని విద్యార్థులకు సూచించారు రైతు లేనిదే రాష్ట్రాలు ప్రపంచాలు లేవని హ్యాపీ కిడ్స్ విద్యా సంస్థలు అధినేత అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు మండలంలోని సాయి నగర్ హ్యాపీ కిడ్స్ పాఠశాల ఆవరణంలో శనివారం మన రైతు, మన గౌరవం కార్యక్రమం నిర్వహించి ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలకు చెందిన రైతులకు ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతు కుటుంబంలోజన్మించిన విద్యార్థులు మా తండ్రి రైతు అంటూ ఘనంగా చెప్పుకోవాలని రైతు లేనిదే రాష్ట్రాలు ప్రపంచాలు లేవని అన్నం పెట్టే రైతులను గౌరవించాలని ధాన్యం పండించే రైతులకు ఘనంగా సత్కరించడం రైతుల పట్ల మనకున్న ఆప్యాయత అని తెలిపారు రైతు కుటుంబంలో పుట్టిన విద్యార్థులు ఎంతో ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు ఈ కార్యక్రమంలో లో పాఠశాల డైరెక్టర్, శివకుమారి, హెడ్మాస్టర్ శ్రీరాములు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో

# భోజనశాల ఏర్పాటు

ముద్దనూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

మండలంలోని ఉప్పలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 45 సంవత్సరాల క్రితం చదివిన పూర్వ విద్యార్థులు ఒక కమిటీగా ఏర్పడి తాము చదువుకొన్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని, పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో చర్చించి, విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం తినుటకు ఒక భోజన శాలను ఏర్పాటు చేయాలని తీర్మానం చేసుకొని, భోజన శాల నిర్మాణానికి దాదాపు 10 లక్షల రూపాయలు చందాలు వేసుకొని, భోజన శాలను నిర్మించి శనివారం నాడు పూర్వ విద్యార్థి డా. శ్రీనివాసుల రెడ్డి, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొద్దుటూరు డివిజన్ ఉపవిత్య శాఖ అధికారి మీనాక్షి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, సీఐ నగేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశలోనే క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. యువత చెడు మార్గాలకు లోనవ్వకుండా మంచి విద్యను అభ్యసించి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు డాక్టర్. వేణు గోపాల్ శర్మ, వెంకటేష్,సంజీవప్ప, శివ ప్రసాద్, వీర ఓబులు, వేణు, ప్రతాప్ ఆచారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్రకు ప్రజల భాగస్వామ్యం

నందలూరు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త :

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శనివారం నందలూరులో కన్యకచెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రైతులతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. ముందస్తు చర్యల వల్లే ఏప్రిల్ నెలాఖరులో కూడా చెరువులో నీటి నిల్వలు కొనసాగుతున్నాయని తెలిపారు. గత ఏడాది వర్షపు నీటిని ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక టిడిపి నాయకుల సమన్వయంతో నిల్వ చేయడం వల్ల చెరువు నిండిందని చెప్పారు. ఈ నీటి వనరుల వల్ల సుమారు 400 ఎకరాల భూములు సాగుకు అనుకూలమయ్యాయని, భూగర్భ జలాల పెరుగుదలతో ప్రాంతానికి గణనీయమైన ఆర్థిక లాభం చేకూరిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన జల భద్రత 100 రోజుల కార్యక్రమంలో ప్రతి రైతు భాగస్వామి కావాలని ఆయన సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని జల వనరుల అభివృద్ధితో అనుసంధానం చేసి మరింత ఫలితాలు సాధిస్తామని తెలిపారు. అనంతరం రైతులు, ప్రజలతో కలిసి జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ డీఈ జగదీశ్వర్ రెడ్డి, ఏఈలు పరశురామయ్య, మధుసూదన్ రావు, ఎంపీడీవో కె.ఆర్.ఎం ప్రసాద్, ఏపీవో మురళి, ఆర్ఐ సుశీల్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రేపూరి వేణుగోపాల్, సింగిల్ విండో అధ్యక్షులు పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు చుక్కయానాది, జంబు సూర్యనారాయణ, చామంచి పెంచలయ్య, మహబూబ్ బాషా, మోడపోతుల రాము, నీటి సంఘం అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.




## జన గణన పై అవగాహన ర్యాలీ




వీరపునాయునిపల్లి ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

సంగమేశ్వర ఉన్నత పాఠశాల నందు జన గణ మన పై మొదటి విడత శిక్షణా కార్యక్రమం సందర్భంగా శనివారం అవగాహన ర్యాలీని తాసిల్దార్ బి. లక్ష్మీదేవి నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెన్సస్ 2027 మూడు రోజుల ట్రైనింగ్ లో భాగంగా మూడవ రోజు తహశీల్దార్ మరియు ఫీల్డ్ ట్రైనర్, ఎన్యుమరేటర్స్ మరియు సూపర్వైజర్ లతో కలిసి సెన్సస్ అవగాహన పై రాల్లి నిర్వహించడం జరిగినదని తెలిపారు అదే విధంగా ఇంటి ఇంటికి వెళ్లి సెన్సస్ సర్వే ను హౌస్ లిస్టింగ్ టెస్ట్ డ్రైవ్ చేయడం జరిగింది తెలిపారు ఈ కార్యక్రమంలో డిటి,ఆర్ఐ, సచివాలయ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 131వ రాజ్యాంగ సవరణ

## బిల్లు విఫల మవడం బాధాకరం

పులివెందుల, ఏప్రిల్ 18 , ప్రభాతవార్త :




మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మహిళల సాధికారతకు కీలకంగా భావించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందకపోవడంపై పులివెందుల బీజేపీ మండల అధ్యక్షుడు వై. నవీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల హక్కుల విషయంలో ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాలు ఆశ్రయించడం దురదృష్టకరమని మండిపడ్డారు. ఈ బిల్లుతో మహిళలకు సమాన హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం పెంపు సాధ్యమయ్యేదని, కానీ కాంగ్రెస్ మరియు ఇండియా అలయన్స్ పార్టీల వ్యతిరేక ధోరణి కారణంగా అది సాధ్యం కాలేదని ఆరోపించారు. దేశ అభివృద్ధికి కీలకమైన అంశాలపై ఇలాంటి అడ్డంకులు సృష్టించడం ప్రజాస్వామ్యానికి హానికరమని వ్యాఖ్యానించారు. మహిళల అభివృద్ధి విషయంలో మాటలు కాకుండా చర్యలు అవసరమని, ప్రతిపక్షాలు తమ వైఖరిపై దేశ మహిళలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని నవీన్ అన్నారు. మహిళల గౌరవం, హక్కులు కాపాడటంలో బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళల సాధికారత కోసం మరింత కృషి కొనసాగిస్తా మని, ఇలాంటి కీలక బిల్లులు మళ్లీ ముందుకు తీసుకురా వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

## ప్రపంచ చారిత్రక కట్టడాల దినోత్సవం

సిద్ధవటం ఏప్రిల్ 18 ప్రభాతవార్త

ప్రపంచ చారిత్రక కట్టడాల దినోత్సవం సందర్భంగా మన చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష పేర్కొన్నారు. ప్రతి ఏటా ప్రపంచ చారిత్రక కట్టడాల దినోత్సవం ఏప్రిల్ 18 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఐక్యరాజ్యసమితి లోని సభ్య దేశాలు వారసత్వ సంపద పరిరక్షణ కోసం ఒకరికొకరు వివిధ అంశాలలో పరస్పరం సహకరించుకోవాలన్నా ప్రధాన లక్ష్యంతో ఈ ప్రపంచ వారసత్వ దినోత్సవం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ప్రపంచంలోని అద్భుతమైన చారిత్రక కట్టడాలను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తిస్తోంది. అలా గుర్తించాలంటే ఆ కట్టడానికి గొప్ప చరిత్ర, నిర్మాణ శైలి, ప్రత్యేకత ఉండాలని తెలియజేశారు. మన పూర్వీకులు నిర్మించిన చారిత్రక కట్టడాలు, కోటలు, దేవాలయాలు మన చరిత్రకు, సంస్కృతికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని తెలిపారు. ఆధునికత పేరుతో ఇటువంటి విలువైన కట్టడాలు కనుమరుగైపోకుండా ప్రభుత్వం, ప్రజలు కలిసి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కడప జిల్లాలో గండికోట కోట,దేవుని కడప శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, పెద్ద దర్గా, ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం, సిద్ధవటం కోట, ఉదయగిరి కోట, పుష్పగిరి దేవాలయ సముదాయం, బ్రహ్మంగారి మఠం వంటి అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన కట్టడాలు ఉన్నాయని, ఇవి జిల్లా గౌరవానికి ప్రతీకలని చెప్పారు. ఈ నిర్మాణాలను పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మన గొప్ప చరిత్రను అందించగలమన్నారు. చారిత్రక కట్టడాలను కాపాడటం అంటే కేవలం పాత నిర్మాణాలను రక్షించడం మాత్రమే కాదు, మన సంస్కృతిని, మన గుర్తింపును నిలబెట్టుకోవడమేనని, ఈ విషయంలో యువత ప్రత్యేక చొరవ చూపాలని ఆయన పిలుపునిచ్చారు.

## వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా పాలీసెట్ హాల్‌టికెట్లు

**- ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి**

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష-2026 హాల్‌టికెట్లు ఏప్రిల్ 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అధికారికంగా అందుబాటులోకి వచ్చినట్లు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తి రెడ్డి తెలిపారు. ఈ పాలీసెట్-2026 పరీక్షను ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను వాట్సాప్ ద్వారా పొందేందుకు 9552300009 నంబరుకు సందేశం పంపి అందులో ఎడ్యుకేషన్ సర్వీసెస్ - పాలీసెట్ ఎంట్రన్స్ హాల్‌టికెట్ ఎంపిక చేసుకొని ఎస్‌ఎస్‌సీ హాల్‌టికెట్ నంబరును నమోదు చేసిన మొబైల్ నంబరు నమోదు చేయాలని తెలిపారు. అలాగే హెచ్‌టీటీపీ ఎస్://పాలీసెట్‌ఏపీ.ఏపీ.గో.ఇన్ ద్వారా హాల్‌టికెట్ పొందవచ్చన్నారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తరువాత వివరాలు సరిచూసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పాలీసెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



## కలసపాడులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

కలసపాడు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:

మండలంలోని కలసపాడులో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఎంపీడీవో మహబూబ్ బి ఆదేశాల మేరకు కలసపాడు తెదేపా యువ నాయకుడు బుసుకే శ్రావణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పంచాయితీ సచివాలయ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణ సుస్థిర ఆంధ్రకు మార్గమని, జలమే జీవన ఆధారమని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మేఘన, కరిష్మా, త్రివేణి, డేవిడ్, ప్రవీణ్ ఎంఆర్సి సుధానంద్ ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# అగ్ని మాపక సిబ్బంది అవగాహన







మైదుకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్. అన్వర్ భాష ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు పరిశ్రమలలో అగ్ని మాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల సంభవించినప్పుడు వాటిపై ఎలా ఎదుర్కోవాలో వారి సిబ్బందికి అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది కేంద్రం నుండి బయలుదేరి నంద్యాల రోడ్డులో ఉన్న శ్రీ సిరి ప్యూర్ ఫిల్లింగ్ స్టేషన్ మరియు శ్రీ అమృత్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నందు చేరుకొని కరపత్రములు పంచి ఆయిల్ మరియు పరిశ్రమ నందు అగ్ని ప్రమాదములు జరిగినప్పుడు ఏ విధంగా ఆర్పవలెను అని ప్రయోగపూర్వకంగా చూపించడం జరిగింది. పెట్రోల్ పంపులు, పరిశ్రమలో పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా ఆపరేట్ చేయాలో చూపించారు. ఈ కార్యక్రమంలో అక్కడ పని చేస్తున్న సిబ్బంది, ప్రజలు మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొనడం జరిగింది. ప్రజలు యువకులు ఏదైనా అగ్ని ప్రమాదము జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 101 కి లేదా 9963737634,8790201101 సమాచారం అందించాలని తెలిపారు.

# గాజులపల్లె భాస్కర్ రెడ్డి సేవలు మరువలేనివి





బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 18 ప్రభాతవార్త :

కీర్తిశేషులు గాజుల పల్లె భాస్కర్ రెడ్డి సేవలు నేటికి మరువలేనివని ప్రముఖ వ్యాపారవేత్త బిజీ వేముల రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి, మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘ అధ్యక్షులు కె.వి సుబ్బారావు, పంగా చెన్న కృష్ణారెడ్డి, తోపాటు పలువురు నాయకులు అన్నారు, గాజులపల్లె భాస్కర్ రెడ్డి నాలుగో వర్ధంతి పురస్కరించుకొని బద్వేల్ పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాథ వృద్ధులకు రుచికరమైన భోజనం, సీట్లు, పండ్లు వితరణ కార్యక్రమాన్ని వారి కుమారుడు గాజులపల్లె సుధాకర్ రెడ్డి, గాజులపల్లె కేశవరెడ్డి మధు కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పలువురికి వితరణ చేశారు, అలాగే మండుతున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని మైదుకూరు రోడ్డు మంచినీటి చలివేంద్రం వద్ద సుమారు 5,00 మందికి పైగా ప్రజలకు చల్లని మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి హాజరైన బిజివెముల రమణారెడ్డి మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే.వీ సుబ్బారావు, లక్ష్మిరెడ్డి తో పాటు పలువురు నాయకులు, ప్రముఖులు మాట్లాడుతూ బద్వేల్ ప్రాంతంలో అనేక సంవత్సరాలుగా నిరుపేద ప్రజలకు చేయూతనిస్తూ బద్వేల్ ప్రాంత ప్రజల ఆదరభిమానాలు పొందిన గాజుల పల్లె భాస్కర్ రెడ్డి మృతి చెంది నాలుగు సంవత్సరాలు అయిన వారి జ్ఞాపకాలు నేటికీ మెదులుతూనే ఉన్నాయన్నారు, దానధర్మాలకు ప్రతీకగా నిలిచిన భాస్కర్ రెడ్డి సేవలు మరువలేని అన్నారు, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఆకాంక్షించారు, ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుధాకర్, పెసల సుధాకర్, కొలిశెట్టి సుబ్రహ్మణ్యం తో పాటు పలువురు నాయకులు పలువురు ప్రజలు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కుల మతాలకు అతీతంగా మల్లెల ఇమాంబి ఉర్సు

తొండూరు ఏప్రిల్ 18 ప్రభాతవార్త :

తొండూరు మండలంలోని మల్లెల గ్రామంలో శ్రీశ్రీశ్రీ హజ్రత్ సయ్యదా ఇమాంబీ (రహ్మతుల్లాహి అలైహా) వారి ఉరుసు మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. సుమారు 648 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ మహోత్సవాలు ప్రాంతీయంగా ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ఏప్రిల్ 18వ తేదీ శనివారం రాత్రి 9 గంటలకు బాణ సంచాలతో,మేళతాళాలు, ఫకీరులతో, గుర్రాల ఊరేగింపులతో గంధ మహోత్సవ కార్యక్రమాన్ని ఊరేగింపుగా అమ్మ దగ్గరికి తీసుకుని వెళ్లి ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం ఏప్రిల్ 19వ తేదీ ఆదివారం రాత్రి 9 గంటలకు ఉరుసు సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఖవ్వాలి పోటీలు కొల్హాపూర్ వారిచే ఘనంగా నిర్వహించడం జరుగుతున్నది. ఏప్రిల్ 20వ తేదీ సోమవారం జియారత్ కార్యక్రమం నిర్వహించబడుతుంది. ప్రతి సంవత్సరం లాగే ఈ ఉరుసు మహోత్సవాల్లో హిందూ, ముస్లిం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మగారి దివ్య ఆశీస్సులు పొందాలని తెలియజేయడం జరిగింది. ఈ వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. మహోత్సవాల ఖర్చును దర్గా కమిటీ భరిస్తోంది. ఖవ్వాలి కార్యక్రమాలకు దర్గా కమిటీతో పాటు ఎన్.ఎస్. 5 నెంబర్ బీడీ సంస్థ సహకారం అందిస్తోంది. దర్గా ఎదుట ఎటువంటి అంగళ్ళు ఏర్పాటు చేయరాదని, కమిటీ అనుమతి లేకుండా స్టేజ్‌పై ఎవరూ కూర్చోరాదని నిర్వాహకులు సూచించారు. భక్తులు చెరువులు, బావులు, కుంటలు, కరెంటు మోటర్ల సమీపంలో జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి ప్రమాదాలు జరిగినా కమిటీ బాధ్యత వహించదని హెచ్చరించారు. ఈ మహోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని దర్గా కమిటీ సభ్యులు మోసిన్ చిస్టి, ఇంతజర్ చిస్టి కోరారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే

# పిల్లలను చేర్చండి

**బడి పిలుస్తోంది కార్యక్రమంలో ఉపాధ్యాయులు**

కలసపాడు, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:

నాణ్యమైవిద్యతో పాటు, క్రమశిక్షణ, నైతికవిలువలు, పెద్దలపట్ల గౌరవం లాంటి విలువలు నేర్పే, సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.మస్తాన్ వలి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనివారం కలసపాడులోని ఆదర్శప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు ఎంఈఓతో కలిసి ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను వివరిస్తూ, పిల్లలను చేర్పించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్ వలి, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, రమణారెడ్డి, చెన్నయ్య, బాలరాజునాయక్ లు మాట్లాడుతూ మీ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే వారికి చదువు చెప్పే బాధ్యత మాది అని హామీ ఇవ్వడంతో పాటు,ప్రభుత్వ పాఠశాలల యందు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు ఉచిత విద్యతోపాటు,ఆహ్లాదకరమైన తరగతి గదులు, నాణ్యమైన సన్న బియ్యంతో కూడిన రుచికరమైన మధ్యాహ్నం భోజనం, మంచి పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్కులు, బ్యాగులు, యూనిఫాం, బూట్లు, రకరకాల ఆట వస్తువులతో పాటు, గ్రంథాలయ పుస్తకాలు,విలువైన బోధనోపకరణాలు, తల్లికి వందనం లాంటి ఎన్నో సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే ఉన్నాయన్నారు. శుభ్రమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, వాటిని శుభ్రపరచడానికి ఆయా లాంటి ఎన్నో సదుపాయాలు ఉన్నందున ఆలోచించి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చి,వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు చౌడమ్మ,రహమత్ బీ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## 20 న ఉచిత మెగా వైద్య శిబిరం

బద్వేలు, ఏప్రిల్ 18 , ప్రభాతవార్త

ఈ నెల 20వ తేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్బీవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి రితేష్ రెడ్డిలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మెడివిజన్ ఐ అండ్ హెల్త్ కేర్ సెంటర్, వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వారి సంయుక్త సహకారంతో ప్రత్యేక వైద్య నిపుణుల చే కార్డియాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఈఎన్ టి, కంటి వైద్య నిపుణులు హాజరై వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం ఉంటుందని, కావున నియోజకవర్గ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలనన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:

కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు ఏఎస్పీ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ కొండారెడ్డి వివిధ నేరాల్లో ముద్దాయిలై పోలీసు స్టేషన్ ముందు రౌడీషీటర్‌గా నమోదైన వ్యక్తులకు శనివారం కౌన్సెలింగ్ ఎనిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో ఉండి మంచి జీవితం కొనసాగించాలన్నారు. రౌడీషీటర్లపై అధికారుల ఆదేశాల మేరకు తొలగించబడుతుంది. దిక్కరించి ఏవైనా నేరాలలో పాల్గొన్నట్లయితే జిల్లా బహిష్కరణతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు.



## ప్రతి నీటి బొట్టు విలువైనదే : వైవియు విసి




**వైవీయూ, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**
రేపటి తరాల భవిష్యత్తు కోసం నేటితరం ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి నిల్వ చేయాల్సిన అవసరం ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జాతీయ సేవా పథకం యూనిట్ 2 జంతు శాస్త్ర శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నీటి అవగాహనపై ఏర్పాటుచేసిన ర్యాలీని ఉపకులపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జీవికి నీరు ప్రాణాధారమని వాటిని కాపాడి తర్వాత తరానికి ఇవ్వడం ద్వారా గొప్ప ఉపకారం చేసినట్లన్నారు. నీటి ఉపయోగంపై ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. కుల సచివులు ఆచార్య పద్మ హాజరై మాట్లాడుతూ మీరు భవిష్యత్తులో ఎదురయ్యే కష్టాల గురించి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్ వెంకట్రామిరెడ్డి, సైన్స్ విభాగ డీన్ ఆచార్య ఏ జీ దాము విద్యార్థులకు సూచనలు చేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్పీ వెంకటరమణ మార్గదర్శకంలో ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ గంగిరెడ్డి, డాక్టర్ అను ప్రసన్న, డాక్టర్ పి మరియదాస్, నాగరాజు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## లోకేష్‌ను కలిసిన డిసిసి బ్యాంక్ చైర్మన్

**బద్వేలు అర్బన్, ఏప్రిల్, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన నారా లోకేష్ ఉమ్మడి కడప జిల్లా డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ ఈరోజు ఉండవల్లిలోని లోకేష్ స్వగృహంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ, క్రమశిక్షణ, అంకిత భావం మరియు నిరంతర శ్రమతో ముందుకు సాగే లోకేష్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

## సీతమ్మవారికి వడిబియ్యం



**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 18 ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణంలోని అమ్మవారి శాల వీధిలో వెలిసిన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శని వారం ఆలయ కమిటీ అధ్యక్షులు పేర్ల జనార్దన్ రావు, సెక్రెటరీ బచ్చు నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ తులసి సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ వల్లం కొండు సత్యనారాయణ మరియు పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించడం జరిగింది, అలాగే ఆలయ ప్రాంగణంలో విష్ణు సహస్రనామ పారాయణం మహిళలచే నిర్వహించారు అనంతరం సీతమ్మవారికి 22,వ రోజు మహిళలు అందరు కలిసి ఒడిబియ్యం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు,పట్టణంలో సీతమ్మ తల్లికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించాలనుకున్నవారు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని వారు తెలిపారు,ఆలయానికి 500 రూపాయలు చెల్లిస్తే ఒడిబియ్యం ఒకరోజు సీతమ్మవారికి నిర్వహిస్తామన్నారు, వివరాలకు 9347342019,2 .9492413185,3.9440592674, నెంబర్లను సంప్రదించాలని ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో వల్లం కొండు శారద, పేర్ల కళ్యాణి, బచ్చు నాగలక్ష్మి, సూరే రేష్మ దేవి, బండారు రత్నాలు, యాదాల్ల విజయనిర్మల, వల్లం కొండు శ్యామల, కోట శైలజ, సోమిశెట్టి లక్ష్మీదేవి,ఒలేటి ప్రసన్న మరియు పలువురు మహిళలు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన వైశాఖ మాసం పూజ





**గోపవరం. ఏప్రిల్ 18. ప్రభాతవార్త.**
గోపవరం మండలం వల్లేరవారి పల్లె గ్రామం లో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు వైశాఖ మాసం ప్రారంభం తో స్వామి అమ్మవారికి వైభవంగా అభిషేకం, రాహుకాలం హోమం,పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది,తదుపరి స్వామి అమ్మవారు ప్రత్యేక సంపంగి పూల అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు, తదు పరి వచ్చిన భక్తులు మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారి మూల విరాట్ అలంకరణ చాలా కన్నులకు కనువిందుగా ఉంది అని స్వామి, అమ్మ వారిని చూస్తూ ఉంటే వారు మా సమస్యలను అడిగి మా సమస్యకు వారు పరిష్కారం తెలిపినట్లుగా మా మనసుకు భావం కలుగుతూ ఉంటుందని వచ్చిన భక్తులు తెలిపారు,స్వామి వారి మాల ధరణ (దీక్ష) స్వీకరించ వలసిన వారు నరసింహ స్వామి ఉపశకుల స్వామి వారిని కలిసి దీక్ష స్వీకరించ వచ్చు అని తెలిపారు తదుపరి స్వామి వారి మహాపాద యాత్ర ఉంటుంది అని ఆలయ ప్రధాన అర్చకులు ఉపశకులు పెంచలయ్య స్వామి తెలిపారు, తదుపరి అన్నదాన కైంకర్యం నిర్వహించారు అన్నదాన కైంకర్యం నిర్వహించిన వారు శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు మరియు రోడ్డు స్టడ్స్ ఏర్పాటు చేసేందుకు, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ ఆర్అండ్‌బీ అధికారులు పోలీసు సిబ్బంది నిర్వహించడం జరిగిందని ఎస్సై తులసీ నాగప్రసాద్ తెలిపారు. ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించి మహిళలు, పిల్లలకు సంబంధించిన కేసులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## 50 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానానికి కువైట్‌లో మహా రక్తదాన శిబిరం

**సుండుపల్లె, ఏప్రిల్ 18, ప్రభాతవార్త :**
50 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ కువైట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకొని మహా రక్తదాన కార్యక్రమాన్ని కువైట్ లోని అదన్ హాస్పిటల్ లో ఘనంగా నిర్వహించడం జరిగిందని ఎన్ ఆర్ ఐ తెలుగు దేశం కువైట్ గల్ఫ్ కౌన్సిల్ సభ్యులు వెంకట్. కోడూరి తెలియజేసారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బాలినేని. హరిప్రసాద్ మరియు రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సుగావాసి. ప్రసాదబాబు పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని సుగవాసి యువసేన అధ్యక్షుడు కంచన రెడ్డిశేఖర్ ఎన్ ఆర్ ఐ,టీడీపీ కువైట్ ఏపీ టీడీపీ యూత్ (కువైట్) అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ ఖాన్, అద్దేపల్లి చిన్నరాజు,తిరుపతి రాజు,ఖదురూన్,వేణు రాజు,పెద్ద నాగూర్,కిరణ్ నాయుడు, చలపతి,రసూల్,మోలాలి,నాని,జిలాన్,200 మంది రక్తదానం చేసారని తెలియజేసారు.ఈసందర్భంగా వెంకట్ కోడూరి మాట్లాడుతూ,తెలుగు ప్రజల గర్వకారణమైన నాయకుడు చంద్రబాబు నాయుడనియు,అభివృద్ధి అంటే ఏమిటో, పరిపాలనలో పారదర్శకత ఎలా ఉండాలో, ప్రజల కోసం పాలన ఎలా సాగాలో తన దూరదృష్టితో చూపించిన మహానేత ఆయన అని కొనియాడారు. సాంకేతికత, మౌలిక వసతులు, పెట్టుబడులు,యువతకు అవకాశాలు ఆయన చూపించిన నాయకత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతోనే

# ఏ కార్యక్రమమైనా విజయవంతం

**రాజంపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త**
ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమం అయినా విజయవంతమవుతుందని రాజంపేట మున్సిపల్ కమిషనర్ ఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, రేపు జరగబోయే జలదార జలహారతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని, సరస్వతీపురం గవర్నమెంట్ హై స్కూల్‌లో విద్యార్థులతో కలిసి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ మున్సిపల్ కమీషనర్ లక్ష్మి నారాయణ ముఖ్య అతిథిగా హాజరై, నీటి సంరక్షణ, పరిశుభ్రత పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సామాజిక సేవా కార్యక్రమాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొని విజయవంతం చేసేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల ద్వారా సమాజంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరిలో బాధ్యతా భావం పెంపొందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ స్కూల్ హెడ్ మాస్టర్ నాగమణి, మెప్మా ప్రతినిధి అయ్యావారయ్య, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, గవర్నమెంట్ స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ లక్ష్మీనారాయణ, అధికారులు

## చంద్రన్నకు స్ఫూర్తిగా కువైట్ లో మహా రక్తదాన శిబిరం


కువైట్‌లో రక్తదానం చేస్తున్న జిల్లా వాసులు


మహా రక్తదాన శిబిరంలో పాల్గొన్న కువైట్ ప్రతినిధులు

**రాజంపేట, ఏప్రిల్ 18 ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి చంద్రబాబు 76 వ పుట్టిన రోజు పురస్కరించుకొని ముందుగా కువైట్లో జిల్లాలోని యువత ఆధాన్ ఆసుపత్రి వేదికగా ఎన్ఆర్ఐ టిడిపి ఆధ్వర్యంలో ప్రతినిధి వెంకట్ కోడూరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కువైట్‌లోని తెలుగుదేశం పార్టీ అభిమానులు, కార్యకర్తలతో బాటు స్వచ్ఛంధ సేవాసమితులు, కూటమి నాయకులు, ప్రవాసాంధ్రులు పెద్ద ఎత్తున హాజరై రక్తధాణ శిభిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన వెంకట్ కోడూరి మాట్లాడుతూ తెలుగు ప్రజల గర్వకారణమైన నాయకుడు చంద్రబాబు నాయుడు ఐదు దశాబ్దాలుగా ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తూ భారత రాజకీయాల్లో అరుదైన స్థానాన్ని సంపాదించారన్నారు.అభివృద్ధి అంటే ఏమిటో, పరిపాలనలో పారదర్శకత ఎలా ఉండాలో, ప్రజల కోసం పాలన ఎలా సాగాలో తన దూరదృష్టితో చూపించిన మహానేత అని కొనియాడారు.రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అపారమైందన్నారు. సమాచార సాంకేతికత, మౌలిక వసతులు, పెట్టుబడులు, యువతకు అవకాశాలు ఈ అన్ని రంగాలలో ఆయన చూపించిన నాయకత్వం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాంటి మహానేత జన్మదినాన్ని కేవలం వేడుకలతో కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం గౌరవంగా ఉంటుందనే ఉద్దేశంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుకు పిలుపునిచ్చామని, వందలాది మంది వచ్చి ప్రస్థానం చేయడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగు ప్రజలు సమాజ సేవలో ముందుండాలని ఈ కార్యక్రమం ద్వారా ఒక బలమైన సందేశాన్ని ఇస్తున్నాం" అని ఆయన అన్నారు.రక్తదాన దాతలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ గారు దాతలును అభినందిస్తూ ప్రశంసా పత్రాన్ని పంపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షురాలు డా సునోవనా ప్రముఖ, మాజీ అధ్యక్షులు డా దివాకర్. కమ్యూనిటీ కార్యదర్శి డా రఘునందన్, బ్లడ్ డోనర్స్ కేరళ నిమిష్ కుమార్, జయన్, ఈ రక్తదాన శిబిరానికి విలువైన సహకారం అందించిన ఏపీఎన్ఆర్‌టీఎస్ అధ్యక్షులు డాక్టర్ రవి వేమూరి,ఎన్నారై తెలుగుదేశం గల్ఫ్ అధ్యక్షులు రావి రాధాకృష్ణ,అలాగే ఏపీఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్ అక్కిల్ నాగేంద్రబాబు, ఎన్నారై తెలుగుదేశం సెల్ చప్పిడి రాజశేఖర్,ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి విశేషంగా కృషి చేసిన తెలుగు దేశం కువైట్ సీనియర్ నాయకులు, ములకల సుబ్బారాయుడు ధరూరి బలరాం నాయుడు, ఉదయ్ ప్రకాశ్, ఒలేటి దివాకర్, మాలేపాటి బాబు, పొలరుపు బాబు నాయుడు, డాక్టర్ నెట్టెం కృష్ణ తదితరులను అభినందించారు.

## కొనిరెడ్డిపై కేసు నమోదు చేయాలి

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త:**
మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి శనివారం ఆయన స్థానిక ఇస్లాంపురం వీధిలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కొత్తపల్లి మాజీ సర్పంచి కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, అతని కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి అక్రమంగా అగస్త్యేశ్వరాలయ భూముల్లో పనులు నిర్వహిస్తున్నారని తాను తెలిపితే వారు తమను అసభ్యంగా మాట్లాడారని, తాము అంతకన్నా అసభ్యంగా మాట్లాడగలిగినా సంస్కారం వలన ఆగిపోతున్నామని తెలిపారు. ఆ భూమిలో తాను దిగి నందుకు కేసు నమోదు చేస్తానని తెలిపిన శివచంద్రారెడ్డి, అసలు ఆ భూమి వారిదని దేవాదాయ శాఖ అధికారుల ఉత్తర్వులు లేకుండా ఆయన ఎలా అక్రమంగా పనులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆ భూమి 11 సంవత్సరాల పాటు శివచంద్రారెడ్డి కి లీజు వుందని తెలిపారని, టెండర్ నిబంధనల ప్రకారం హెచ్చు పాటదారునికి ఉత్తర్వులు అందింతేనే అక్కడ పనులు నిర్వహించాలని వివరించారు. ఆ భూమి కి టెండర్ జరిగింది, పాట జరిగి శివచంద్రారెడ్డి కేవలం ఒక సారి మాత్రమే డబ్బు చెల్లించారని, వారికి అధికారుల నుంచి ఎటువంటి ఉత్తర్వులు లేవని ఆరోపించారు. కేవలం తెర ముందు శివచంద్రారెడ్డి, తెర వెనుక ఎమ్మెల్యే తనయుడు నంద్యాల కొండారెడ్డి, ఆపైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అండదండలతోనే ఇదంతా జరుగుతుందని, లేని పక్షంలో టెండర్ నిబంధనకు వ్యతిరేకంగా పనులు చేస్తున్న శివచంద్రారెడ్డి, ఆయన కుమారుడు హర్షవర్ధన్ రెడ్డిపై ఎమ్మెల్యే కేసు నమోదు చేయించాలని సవాల్ విసిరారు. ఎన్నికల సమయం నుండి తాను, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, రాచమల్లు కిరణ్ కుమార్ రెడ్డి అవినీతి చేశామని, భూములు ఆక్రమణాలు చేశామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డామని ఆరోపించిన ఎమ్మెల్యే, ఇప్పటి వరకు ఆయనకు ప్రజా దర్బార్ లో తమపై ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చినా బహిర్గతం చేయాలని, తమపై అవినీతి నిరూపించాలని, చట్ట ప్రకారం కొనసాగాలని పిలుపునిచ్చారు. అదే విధంగా తాను హత్య చేసే వ్యక్తినని శివచంద్రారెడ్డి ఆరోపించారని, తనకు అలాంటి వ్యక్తిత్వం వుంటే శివచంద్రారెడ్డి తనను పత్రికా ముఖంగా అమర్యాదగా విమర్శించేవారా అని ప్రశ్నించారు. శివాలయం భూముల విషయంలో శివచంద్రారెడ్డి కి గత సంవత్సరమే 2 నోటీసులు వచ్చాయని తెలిపారు. గతంలో ఆ టెండర్ వైసీపీ వారే నిర్వహించారని తెలిపిన శివచంద్రారెడ్డి తాము టెండర్ జరిపి వుంటే తామే పాడే వారమని, ప్రస్తుతమైనా రీ టెండర్ జరపాలని సూచించారు. కేవలం 2 ఎకరాలు వున్న శివచంద్రారెడ్డి కుటుంబం కానపల్లెలో పెద్ద కుటుంబం ఎలా అవుతుందని ప్రశ్నించారు. మజ్జిగ పంపిణీ, అన్నదానం కోసం దాతాల నుండి విరాళాలు తెచ్చిన శివచంద్రారెడ్డి తనను విమర్శించే స్థాయి లేదని స్పష్టం చేశారు. ఇకనైనా ఆ టెండర్ విషయంలో ఉత్తర్వులు వుంటే చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సి.ఎస్. ఖాజామోహిద్దీన్, వైసీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జనగణనకు ప్రజలు సహకరించాలి

**దువ్వూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**
జనగణనకు ఎన్యుమినేటర్ లు ఇంటి వద్దకు వచ్చినప్పుడు సరైన సమాచారం ఇచ్చి ప్రజలు సహకరించాలని మండల తహసిల్దార్ సంజీవరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నందు 3 రోజుల పాటు ఎన్యుమినేటర్లకు శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన, ఇండ్ల గణన డేటా సేకరణకు సంబంధించి 3 రోజులు శిక్షణ ఇచ్చామని, ఈ శిక్షణ ద్వారా జనగణనను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఎన్యుమినేటర్ తనకు నిర్ణయించిన ఇండ్ల గణనను ఖచ్చితంగా ఇచ్చిన సమయంలో ఇళ్ల జాబితా మరియు ఇండ్ల గణన పూర్తి చేయాలన్నారు. మే నెల 1వ తేదీ నుండి 30 వరకు జరిగే గణనకు ప్రజలు సహకరించి సరైన సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే ఈ నెల 16 నుండి స్వీయ గణన కార్యక్రమం జరుగుతుందని వీటిని పూర్తి చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్, వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.




## స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**
పెండ్లిమర్రి మండలం, పెండ్లిమర్రి గ్రామ పంచాయతీలో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 3వ శనివారం వాటర్ పాజిటీవ్ ఆంధ్ర థీంలో భాగంగా వర్షపు నీటి సంగ్రహణ పద్ధతులు, మరమ్మతుల పునరుద్దరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మార్వో శోభన్‌బాబు, ఎంఈవో సుజాత, గంగాధర్ నాయక్, డిప్యూటీ ఎంపీడీవో, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో-1, 2, ఉపాధ్యాయులు, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే

# పౌష్టికాహారం అందించాలి



**మైదుకూరు, ఏప్రిల్ 18, ప్రభాతవార్త:**
మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ జె.ప్రశాంతి మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా కుటుంబం లో పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. పిల్లలకు జంక్ ఫుడ్ వంటివి దూరంగా ఉంచి ఇంట్లోనే సంప్రదాయ చిరు తిండ్లను అలవాటు చేయడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని తెలిపారు. పిల్లలకు సెల్ ఫోన్, టీవీ లు దూరంగా ఉంచి పిల్లలను ఆటపాటల్లో నిమగ్నం చేసి వారి మేధోభివృద్ధికి తల్లి తండ్రులు మరియు కుటుంబ సభ్యులు సహకరించాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఇంట్లో కుమార్తె లతో స్నేహంగా ఉంటూ వారి పరిస్థితి ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ బాల్య వివాహాలకు దారి తీసే పరిస్థితులను అరికట్టాలని కోరారు. అదే విధంగా ప్రతి ఇంట్లో మునగాకు పొడి ని వంటల్లో వాడుకుని రక్త హీనత ని నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## మోసపూరిత మతమార్పిడిలను అడ్డుకోవాలి



**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 18 ప్రభాతవార్త**
మోసపూరిత మతమార్పిడిలను అడ్డుకోవాలని ప్రొద్దుటూరు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున రావు, రిటైర్డ్ ఆర్డీవో సుధాకర్ రెడ్డి శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విశ్వహిందూ పరిషత్, బజరంగ దళ్, మరియు బిజెపి నాయకులు ఈ విషయమై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ అజయ్ బాబుకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిసిఎస్ ఘటన అత్యంత విచారించదగ్గ విషయం అన్నారు. మహారాష్ట్ర లోని నాసిక్ లో టిసిఎస్ కంపెనీలో పనిచేస్తున్నటువంటి కొందరు ముస్లిం ఉద్యోగస్తులు తోటి కంపెనీలో పనిచేస్తున్న హిందూ ఉద్యోగస్తుల నమ్మకాల పైన విశ్వాసం పైన దేవుళ్లపైన నీచంగా మాట్లాడారని, హిందూ యువతలను లవ్ జిహాద్ పేరుతో మరియు ఇప్పుడు కొత్తగా (జాబ్ జిహాద్) పేరుతో ప్రలోభ పెట్టి లోబర్చుకొని పెళ్లి చేసుకుంటామని నమ్మించి బలవంతపు మత మార్పిళ్ళు చేయాలని చూశారని, ఒక నాసిక్ లోనే కాదు మన తెలుగు రాష్ట్రాల్లో కూడా అన్ని కార్పొరేట్ కంపెనీల్లో మహిళల పట్ల లైంగిక మరియు మతమార్పిడులు వంటి అరాచకాలు ఎన్నో జరుగుతున్నాయని, వీటన్నింటి పైన విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల మల్లికార్జున రావు, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు పుష్పాల శ్రీనాథ్ రెడ్డి, బిజెపి పట్టణాధ్యక్షులు వంకదార నరేందర్ రావు, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షుడు నాగముణి రెడ్డి, గంగిశెట్టి, మురళి, సుధాకర్ రెడ్డి, శివశక్తి పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ కార్యక్రమం




**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 18 ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని కందిమల్లయపల్లె 2 అంగన్వాడి సెంటర్ నందు శనివారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. పుట్టినప్పటి నుండి రెండు సంవత్సరంలోపు పిల్లల్లో మెదడు అభివృద్ధి 80!! జరుగుతుంది పిల్లల పెరుగుదల శారీరక, మానసిక అభివృద్ధి కి పిల్లలలో ప్రేరణ తల్లులు ఏ విధంగా ఇవ్వడం జరిగింది. పోషణ విషయం లో జంకు ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను, గురించి ,మొబైల్ వాడడం వలన పిల్లల్లో బుద్ధిమాంద్యం ఏర్పడుతుంది అంశాలపైన అవగాహనా కల్పిస్తూ ప్రతి ఇంటికి మునగాకు చెట్టు ఉండాలి అని మునగాకు సంపూర్ణ పోషకారం అని, మునగాకు లో కాల్షియమ్, ఐరన్, విటమిన్ 12 వంటి పోషక విలువలు వున్నాయి ప్రతి ఒక్కరు మునగాకు తీసుకోవాలి అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు గర్భవతులు, బాలింతలు, 06 సంవత్సరాలపిల్లలు తల్లులు మరియు తండ్రులు, అంగన్వాడీ టీచర్స్, ఆయా లు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం

**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 18 ప్రభాతవార్త**
శుభ్రత మన బాధ్యత ఆరోగ్యం మన సంపద అని ఎంపీడీవో రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.శనివారం బ్రహ్మంగారిమఠం మండలంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మల్లెపల్లెలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడుతూ స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణే సుస్థిర ఆంధ్రకు మార్గం అనే నినాదాన్ని తెలుపుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర సాధన అందరి బాధ్యతగా భావించాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సోక్ పిట్స్, డ్రైనేజీ నిర్వహణ, నీటి వృధా నివారణ చర్యలు, నీటి సంరక్షణ తదితర వాటిపై ఎంపీడీవో అవగాహన కల్పించారు.అనంతరం స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ ,ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో కూడా స్వచ్ఛ ఆంధ్ర , స్వర్ణాంధ్ర కార్యక్రమం ఘనంగా జరిగింది. పై కార్యక్రమాల్లో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, ఉపాధి ఏపీవో హరికృష్ణ , పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్, ఆర్డబ్ల్యూఎస్ , సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

